

అవగాహనతోనే రహదారి భద్రత

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి
- రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులు
- జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

-వార్త 7వ పేజీలో



మాట్లాడుతున్న ఎస్పీ, పక్కన కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి

ఆర్థిక రాజధానిగా విశాఖ

ఐటీ కేంద్రంగా, మెడికల్ డివైస్ తయారీ హబ్‌గా తీర్చిదిద్దుతాం

ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం



కృష్ణరాయపురం సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేశ్



చిట్టివలస సభకు హాజరైన టీడీపీ, జనసేన శ్రేణులు. (పక్కన) మాట్లాడుతున్న నారా లోకేశ్

- ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీల భర్తీ
- ఉద్యోగం వచ్చేంత వరకూ నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం
- భీమిలితో నాకు ప్రత్యేక అనుబంధం
- గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేయాలని చంద్రబాబునాయుడు చెప్పారు
- చిట్టివలస శంఖారావం సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
- మోస్ట్ హ్యాపెనింగ్ సిటీని విషాద నగరంగా మార్చిన ఘనత జగన్‌దేనంటూ ధ్వజం

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):

విశాఖ నగరాన్ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. గతంలో తాను ఐటీ శాఖా మంత్రిగా ఉన్నప్పుడు నగరానికి అనేక పరిశ్రమలు తీసుకువచ్చానని గుర్తుచేశారు. శనివారం సాయంత్రం భీమిలి నియోజకవర్గ పరిధిలోని చిట్టివలస ఫుట్‌బాల్ మైదానంలో నిర్వహించిన శంఖారావం సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా ఒకప్పుడు పేరుగాంచిన విశాఖను జగన్‌రెడ్డి విషాద నగరంగా మార్చేశాడన్నారు. అభివృద్ధిలో అంతర్జాతీయ ఖ్యాతిని ఒకప్పుడు తెస్తే...ఇప్పుడు ఇండియాకు గంజాయి క్యాపిటల్‌గా మార్చేశాడన్నారు. సొంత ఎంపీ కుటుంబ సభ్యులనే కిడ్నాప్ చేస్తే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. విశాఖకు ఒక్క పరిశ్రమను తీసుకురాకపోయినా.. రుషికొండకు గుండు కొట్టి ... మిగతా 6వ పేజీలో

ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్

- ఈ ప్రాంతాన్ని దోచుకునేందుకు సాయిరెడ్డి, సుబ్బారెడ్డి, బొత్సకు లైసెన్స్ ఇచ్చారు
- ఆయనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి
- అవసరమైతే విశాఖ ఉక్కును రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో టిడ్కో ఇళ్లు
- టీడీపీ, జనసేన కేడర్ మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు
- ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ.. దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- కృష్ణరాయపురం సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనపై ఉత్తరాంధ్ర ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనపై ఉత్తరాంధ్ర ప్రజలు గర్జిస్తున్నారన్నారు. పోరాటాల పురిటిగడ్డ ఉత్తరాంధ్ర అని పేర్కొంటూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ ఇక్కడ ప్రజలతో జగన్ ఆటాడుకున్నారని, ఆయనతో ప్రజలు ఫుట్‌బాల్ ఆడే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. శనివారం మధ్యాహ్నం విశాఖ జిల్లా ... మిగతా 6వ పేజీలో

నేడు జనసేన అధినేత రాక

నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్తలతో భేటీ

- ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడతారని సమాచారం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం విశాఖపట్నం వస్తున్నారు. ఆయన హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు ప్రత్యేక విమానంలో నగరానికి చేరుకుని నోవాటెల్ హోటల్‌లో బస చేస్తారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలతో సమావేశం అవుతారు. అందరితో ఒకేసారి కాకుండా ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడతారని సమాచారం.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా (విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి)లో మూడు లోక్‌సభ, 15 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. రాబోయే ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసేందుకు చాలామంది ఉవ్విళ్లూరుతున్నారు. ఇటీవల కాలంలో సీనియర్ నాయకులు చాలామంది చేరారు. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఇటీవల పార్టీలో చేరారు. ఎటువంటి బాధ్యత ఇచ్చినా పనిచేస్తానని ప్రకటించారు. విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షునిగా పంచకర్ల రమేశ్‌బాబు ఉన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం ఉంది. విశాఖ సిటీ అధ్యక్షునిగా ఇటీవలె ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఆయన భావిస్తున్నారు. ఇంకా శివశంకర్, బొలిశెట్టి సత్య, కోన తాతారావు వంటి నేతలు వున్నారు. అలాగే సుందరపు విజయకుమార్ (ఎలమంచిలి), పసుపులేటి ఉషాకిరణ్ (ఉత్తరం), పంచకర్ల సందీప్ (భీమిలి) వంటివారు నియోజకవర్గ సమన్వయకర్తలుగా ఉన్నారు. సామాజిక వర్గాల బలం, సీనియారిటీ...ఇలా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని అవకాశం కల్పించాలని పార్టీ అధినేత ఆలోచన. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన మధ్య పొత్తు కుదిరింది. బీజేపీ కూడా రేపో మాపో కూటమిలో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎవరికి ఎన్ని సీట్లు, ఎక్కడ అనేది ఇంకా ఖరారు కాలేదు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ విశాఖపట్నం వస్తున్నారు. టికెట్లు ఆశిస్తున్న వారితో పాటు నియోజకవర్గ సమన్వయకర్తలను నోవాటెల్ హోటల్‌కు రావాలని పార్టీ కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది. ఎంతమందికి పోటీ చేసే అవకాశం వస్తుంది?, రాని వారు ఏమి చేయాలి?, భవిష్యత్తులో వారికి లభించే ప్రాధాన్యం ఏమిటి?, ఈ కీలక సమయంలో పొత్తు పెట్టుకునే పార్టీలతో సమన్వయం చేయాల్సిన ఆవశ్యకత వంటి విషయాలను పవన్‌కల్యాణ్ వివరిస్తారని తెలుస్తోంది.

సీపీఎస్ ఉద్యోగులపై ప్రభుత్వం ఆంక్షలు

విజయవాడ ధర్నాకు వెళ్లకుండా కట్టడి చర్యలు

- పోలీసులతో నోటీసులు జారీ
- అనకాపల్లి పోలీసుల అదుపులో ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్
- 151 నోటీసు అందజేసి.. రాత్రి 9 గంటలకు విడుదల



ఎలమంచిలిలో ఉపాధ్యాయ సంఘాల నేతలకు నోటీసులు ఇస్తున్న పట్టణ ఎస్ఐ పాపినాయుడు

అనకాపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ముందు ప్రతిపక్షనేతగా జగన్ హామీ ఇచ్చిన మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏపీసీపీఎస్ఈఏ ఆదివారం నిర్వహించనున్న 'ఛలో విజయవాడ' కార్యక్రమానికి ఉద్యోగులు వెళ్లకుండా వైసీపీ ప్రభుత్వం పలు అడ్డంకులు కల్పిస్తున్నది. శనివారం జిల్లాలో పలువురు ఉద్యోగులు, సంఘం నాయకులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. విజయవాడ వెళితే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాగా ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీశ్‌తోపాటు ఉద్యోగుల సంఘం మాజీ నేత రొంగలి అప్పలరాజును శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 151 నోటీసు అందజేసి రాత్రి తొమ్మిది గంటల సమయంలో విడుదల చేశారు.

ఎలమంచిలిలో ఏపీటీఎఫ్, ఎస్టీయూ నేతలకు..

ఎలమంచిలి, ఫిబ్రవరి 17: 'ఓట్ ఫర్ ఓపీఎస్' నినాదంతో 'ఛలో విజయవాడ' కార్యక్రమానికి వెళుతున్న ఏపీటీఎఫ్, ఎస్టీయూ నేతలు బి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, రాజశేఖర్, ఆనంద్, బాలాజీ, రాజాబాబు, అంజాద్, తదితరులకు పట్టణ ఎస్ఐ పాపినాయుడు శనివారం ముందస్తు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకు ఆందోళనలు నిర్వహించడం ఉద్యోగులకు ఉన్న హక్కు అని, పోలీసులను అడ్డంపెట్టుకుని హక్కును హరించడం ప్రభుత్వానికి తగదని హెచ్చరించారు. అప్రజాస్వామిక విధానాలను ప్రభుత్వం వీడాలని, ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు ... మిగతా 6వ పేజీలో

గ్రోయిన్లపై పాలకులు నిర్లక్ష్యం

ఐదేళ్ల నుంచి మరమ్మతులు, పునర్నిర్మాణానికి నోచుకోని చిన్నతరహా సాగునీటి వనరులు

- శిథిలావస్థకు చేరిన ఆనకట్టలు, కాలువల్లో పేరుకున్న పూడిక
- ఆయకట్టుకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన
- ఏటా ప్రతిపాదనలకే పరిమితమైన నిధులు మంజూరు



కశింకోట మండలం తేగాడ సమీపంలో దెబ్బతిన్న గ్రోయిన్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సాగునీటి వనరుల ఆధునికీకరణ, మరమ్మతులపై వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నది. ప్రభుత్వ పదవీ కాలం మరికొద్ది రోజుల్లో ముగిసిపోతున్నా.. జిల్లాలో సాగునీటి వనరుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా వుంది. ప్రధానంగా పెద్దేరు, శారదా నదులపై గ్రోయిన్లు మరమ్మతులకు గురై రైతులు ఇబ్బంది పడుతున్నప్పటికీ వైసీసీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రోయిన్ల మరమ్మతుల పనులకు ఎప్పటికప్పుడు నిధులు మంజూరైన విషయాన్ని రైతులు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రోయిన్ల మరమ్మతులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా పూర్తిగా గాలికొదిలేసిందని ఆవేదన చెందుతున్నారు. పంట కాలువలు సైతం పూడికతో నిండిపోయి, తుప్పలు పెరిగిపోయాయమని, దీంతో గ్రోయిన్ల నుంచి పంట కాలువకు నీరు ప్రవహించకుండా వృథాగా దిగువకుపోతున్నదని వాపోతున్నారు. ఫలితంగా వేలాది ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు, మరోవైపు గ్రోయిన్లకు మరమ్మతులు చేయించకపోవడంతో ఆయా ఆనకట్టల పరిధిలో కనీసం 20 శాతం భూముల్లో కూడా పంటలు పండలేదని రైతులు వాపోతున్నారు.

అనకాపల్లి, ఎలమంచిలి నియోజకవర్గాల పరిధిలో శారదా నదిపై తగరంపూడి, సీతానగరం, తుమ్మపాల, చెర్లోపలి, నాగులాపల్లి, కాశీమదుం, పేరంటాలపాలెం, వెదురుపర్తి, ఉగ్గినపాలెం ప్రాంతాల్లో గ్రోయిన్లు గ్రోయిన్లు వున్నాయి. వీటి కింద అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాల పరిధిలో సుమారు తొమ్మిది వేల ఎకరాల ఆయకట్టు వుంది. కశింకోట మండలంలో కాశీమదుం గ్రోయిన్, పేరంటాలపాలెం, వెదురుపర్తి, ఉగ్గినపాలెం గ్రోయిన్లు మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరాయి. అనకాపల్లి మండలం బవులవాడ, దిబ్బపాలెం పంచాయతీల పరిధిలోని సీతానగరం గ్రోయిన్‌కు చాలా కాలం నుంచి మరమ్మతు పనులు జరగడంలేదు. అదే విధంగా చోడవరం నియోజకవర్గం పరిధిలో శారదా, పెద్దేరు నదులపై వడ్డాది, గౌరీపట్నం, బెన్నవోలు, చాకిపల్లి, కలిగొట్ల, మల్లాం ప్రాంతాల్లో గ్రోయిన్లు ఉన్నాయి. వీటి కింద సుమారు ఆరు వేల ఎకరాల ఆయకట్టు వుంది. వరదల ధాటికి ఇవి కూడా శిథిలావస్థకు చేరాయి. కానీ ఐదేళ్ల నుంచి ఒక్కసారి కూడా మరమ్మతులు చేయలేదని రైతులు వాపోతున్నారు.



అనకాపల్లి మండలం సీతానగరం శారదా గ్రోయిన్ దుస్థితి

మరమ్మతు పనులు ప్రతిపాదనలకే పరిమితం

జల వనరుల శాఖ ఇంజనీర్లు ప్రతి ఏటా శారదా, పెద్దేరు నదులపై గ్రోయిన్ల మరమ్మతులు, కొన్నిచోట్ల పూర్తిగా కొట్టుకుపోయిన గ్రోయిన్ల పునర్నిర్మాణ పనులకు నిధులు మంజూరు కోసం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నారు. కానీ ఒక్కసారి కూడా నిధులు విడుదల కాలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ... మిగతా 6వ పేజీలో

పేట వైసీపీలో తిరుగుబాటు!

ఎమ్మెల్యే టికెట్ స్థానికులకే ఇవ్వాలని డిమాండ్

- ప్లకార్డులతో ప్రదర్శన
- వేరే జిల్లా వ్యక్తిని ఇక్కడ ఇన్‌చార్జిగా ఎలా నియమిస్తారంటూ అధిష్ఠానంపై ఆగ్రహం
- 'జోగులు వద్దు.. స్థానికులు ముద్దు' అంటూ నినాదాలు



పాయకరావుపేటలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ శ్రేణులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 17:

రానున్న ఎన్నికల్లో పాయకరావుపేట వైసీపీ టికెట్‌ను స్థానికులకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ పార్టీ నాయకులు గూటూరు శ్రీనివాసరావు, ధనిశెట్టి బాబూరావు ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహించారు. 'జోగులు వద్దు.. స్థానికులు ముద్దు' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంగవరం రోడ్డు జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, వైసీపీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం కొంతమంది స్వార్థపరుల మాటలు నమ్మి, మొదటి నుంచి వైసీపీలో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషిచేస్తున్న తమను విస్మరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎస్సీ రిజర్వుడ్ అసెంబ్లీ నియోజకవర్గాలకు స్థానిక ఎస్సీ నాయకులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానం అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు మాత్రం విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే జోగులుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం దారుణమన్నారు. ఇప్పటికైనా పార్టీ పెద్దలు ... మిగతా 6వ పేజీలో

తహసీల్దార్ రమణయ్య బంధువు రాజేంద్ర మృతి · 7లో



నాగులాపల్లిలో 'నారా లోకేశ్ యువగళం కప్' రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

మునగపాక మండలం నాగులాపల్లిలో శనివారం రాత్రి 'నారా లోకేశ్ యువగళం కప్' రాష్ట్రస్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలను మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికే కాదు క్రీడలకు కూడా గ్రహణం పట్టించిన సైకో ముఖ్యమంత్రి దొరకడం ప్రజల దురదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ నేతలు ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు, గణబాబు, పీలా గోవింద, దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు. -వార్త 7వ పేజీలో

కబడ్డీ పోటీల ప్రారంభ కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడు, బండారు, ప్రగడ, పప్పల చలపతిరావు, గణబాబు, పీలా గోవింద, రత్నాకర్, తదితరులు

నూతన విత్తనోత్పత్తిని పెంపొందించండి

▸▸ శాస్త్రవేత్తలకు విస్తరణ సహాయ సంచాలకులు డాక్టర్ ముకుందరావు సూచన


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ముకుందరావు

రాంబిల్లి, ఫిబ్రవరి 17 : గ్రామస్థాయిలో నూతన విత్తనోత్పత్తిని పెంచడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సహాయ సంచాలకులు డాక్టర్ ముకుందరావు సూచించారు. హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన శాస్త్రీయ సలహా సంఘం సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ యువతను లాభసాటి వ్యవసాయం వైపు మళ్లించేలా ప్రణాళికలు చేయాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో మరింత నూతన సాంకేతికతతో కూడిన ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయాలని శాస్త్రవేత్తలకు సూచించారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీకే జగన్నాథరావు మాట్లాడుతూ వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించడం ద్వారా కూలీల కొరత సమస్య నివారణ శ్రమ ఆదా అయ్యేలా ప్రదర్శన క్షేత్రాలు నిర్వహించాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా చేపట్టబోయే కార్యక్రమాల ప్రణాళికలను సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజాకుర్రా వివరించారు. బీసీటీ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ రావు తట్టపర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చింతపల్లి పరిశోధనా స్థానం పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.సురేష్ కుమార్, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ కదిరి మోహన్, కొక్కిరాపల్లి నువ్వుల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కుమారి, ఆత్మ పీడీ ఆశాదేవి, జిల్లా వనరుల కేంద్రం అధికారులు శ్రీధర్, సుబ్రహ్మణ్యం, నాబార్డు ఏజీఎం సుమంత్‌కుమార్, ఉద్యానశాఖ జిల్లా అధికారి ప్రభాకరరావు, పశువైద్య విభాగం అధికారి డాక్టర్ రఘునాథ్, మత్స్యపరిశోధనా స్థానం అధికారి డాక్టర్ అహ్మద్ బాషా, కొండెంపూడి కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజ్ కుమార్, కృషి విజ్ఞానకేంద్ర శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

'సుగంధ మొక్కల పెంపకంతో మెరుగైన ఆదాయం'


రైతులకు నిమ్మగడ్డి మొక్కలందిస్తున్న శాస్త్రవేత్తలు

పాయకరావుపేట, ఫిబ్రవరి 17 : సుగంధ మొక్కల పెంపకం ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చని కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల సంస్థ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీడీ కిరణ్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక శ్రీపకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సుంగంధ మొక్కల ద్వారా వచ్చే నూనెను విటమిన్-ఎకి సంబంధించిన ఔషధాలలో వినియోగిస్తుండడం వలన ఈ నూనెకు మంచి డిమాండ్‌తోపాటు అధిక ఆదాయం వస్తుందన్నారు. అనంతరం సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ జె.కోటేశ్‌కుమార్, డాక్టర్ కేవీఎస్ఎస్ శ్రీనివాస్ తదితరులు ఔషధమొక్కల పెంపకం, యాజమాన్య పద్ధతులను వివరించారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సొసైటీ అధ్యక్షులు డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, చిత్రపు వాసుదేవరావు, ప్రాజెక్ట్ టెక్నికల్ కృష్ణవంశీ, దేవవరపు ఆనంద్, రావు జగ్గారావు, డి.కిరణ్, ఆదినారాయణ పాల్గొన్నారు.

'పేట' వైసీపీలో తిరుగుబాటు!

... 5వ పేజీ తరువాయి

స్పందించి వచ్చే ఎన్నికల్లో పాయకరావుపేట ఎమ్మెల్యే టికెట్‌ను స్థానికులకు కేటాయిస్తే కచ్చితంగా గెలిపించుకుంటామని తెలిపారు. వైసీపీ నాయకుడు దేవవరపు సూర్యచక్రం మాట్లాడుతూ, పాయకరావుపేటకు చెందిన కొంతమంది వైసీపీ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి తమ స్వప్రయోజనాల కోసం పార్టీ అభివృద్ధికి కష్టపడే వారిని అణగదొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. వైస్ ఎంపీపీ-2 పల్లెల మణికంఠస్వామి, వైసీపీ నాయకులు కాదా రామకృష్ణ, గోసల కృష్ణ, ధనిశెట్టి బుజ్జి, కోనే పుత్రయ్య, గూటూరు రామ గోవిందు, నేలపర్తి అర్జున్, అనిశెట్టి వెంకటసూరి, కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్

... 5వ పేజీ తరువాయి

పెందుర్తి మండలం కృష్ణరాయపురం ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. చంద్రబాబు హయాంలో నగరానికి ఐటీ పరిశ్రమలు, అదానీ డేటా సెంటర్, మెడ్‌టెక్ జోన్ తీసుకువచ్చారని, జగన్ పాలనలో భూకబ్జాలు, కిడ్నాప్‌లు, దోపిడీలు, చెరువుల ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్ అని వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్రను దోచుకునేందుకు బొత్స, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి కుటుంబాలకు లైసెన్స్ ఇచ్చారన్నారు. వీరంతా పందికొక్కులా దోచుకున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని జగన్ చూస్తున్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం వచ్చిన వెంటనే విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. టీడీపీ, జనసేన కేడర్ మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు.

జగన్‌ది రాజారెడ్డి రాజ్యాంగం

తాను బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి లోబడి పనిచేస్తానని, అదే జగన్ మాత్రం రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. తాను ప్రజల్లో తిరుగుతుంటే జగన్ మాత్రం పరదాల మాటున పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రిగా తాను టీసీఎల్, హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్, జోహో...వంటి పరిశ్రమలు తీసుకువస్తే జగన్ బూమ్‌బూమ్, ప్రెసిడెంట్ మెడల్ వంటి మద్యం బ్రాండ్లు తీసుకువచ్చారన్నారు.

నవ మోసాలు

ఎన్నికల ముందు నవరత్నాలు అని ఊదరగొట్టిన జగన్, అధికారంలోకి వచ్చిన తరువాత దానిని నవ మోసాలుగా చేశారని లోకేశ్ ధ్వజమెత్తారు. మద్య నిషేధం చేసిన తరువాతే ఓట్లు అడుగుతానని ప్రజలను నమ్మించిన వ్యక్తి...మాట తప్పడమే కాకుండా నేడు వీధివీధినా మద్యం అమ్ముతున్నారన్నారు. ప్రజల కష్టాలు చూసి చంద్రబాబు సూపర్ సిక్స్ ప్రకటించారని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించారు. బూత్ స్థాయి అధ్యక్షులు, ముఖ్యమైన నాయకులు రానున్న రెండు నెలల్లో ప్రజల్లోకి వెళ్లి సూపర్ సిక్స్ కోసం ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సభలో పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బండారు సత్యనారాయణమూర్తి, జనసేన రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి కేడర్‌కు లోకేశ్ సూపర్ సిక్స్ కిట్లు పంపిణీ చేశారు.

ఆర్థిక రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నాడని దుయ్యబట్టారు. తాము విశాఖను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లై ఓవర్‌లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. మెడికల్ డివైస్ తయారీ హబ్‌గా, ఐటీ కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దుతామని లోకేష్ స్పష్టంచేశారు. ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని, ఉద్యోగం వచ్చేంత వరకు మూడు వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. భీమిలి నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, 2019 ఎన్నికల్లో తనను ఇక్కడి నుంచి పోటీ చేయాల్సిందిగా చంద్రబాబు చెప్పారన్నారు. కానీ, మూడు దశాబ్దాల నుంచి టీడీపీ గెలవని స్థానాన్ని కోరి మరీ మంగళగిరి నుంచి తాను పోటీ చేశానని, స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యానన్నారు. భీమిలి నుంచి పోటీ చేస్తే తనతోపాటు భరత్ కూడా నెగ్గేవాడని, ఆ మాట ఇప్పటికీ భరత్ చెబుతుంటాడన్నారు. భవిష్యత్తులో కూడా భీమిలిని అభివృద్ధి చేసే బాధ్యతను తాము తీసుకుంటామని స్పష్టం చేశారు.

2014 నుంచి 2019 వరకు ఇక్కడ వేయి కోట్ల అభివృద్ధి పనులు చేశామని, ఇండోర్ స్టేడియం, మిలీనియం టవర్ ఏర్పాటుచేయడంతోపాటు టిడ్కో ఇళ్లను నిర్మించామన్నారు. 2019లో భీమిలి నియోజకవర్గ ప్రజలు పాలిచ్చే ఆవును కాదని, తన్నే దున్నపోతును గెలిపించుకున్నారన్నారు. అరగంట అవంతి మంత్రిగా పనిచేసినా ఇక్కడి అభివృద్ధి పనులు చేయలేదని, ప్రజల జీవితాల్లో మార్పులు రాలేదన్నారు. ఆయనకు రాసలీలలు మాత్రమే తెలుసునని ఎద్దేవా చేశారు. ఆయన వ్యవహారాన్ని చూడలేక ఇక్కడి ప్రజలు తలదించుకునే పరిస్థితి దాపురించిందన్నారు. వైసీపీ నాయకులు అవినీతికి కేరాఫ్‌గా భీమిలిని మార్చారని, రాష్ట్రంలోని నాయకులంతా ఇక్కడి భూములపై పడ్డారని ఆరోపిం చారు. ఈ ప్రాంతానికి చెందిన రూ.2500 కోట్ల విలువైన భూములను వైకాపా నాయ కులు దోచుకున్నారన్నారు. అరగంట అవంతి అవినీతి పెరిగిపోయిందని, అనేక పోస్టులు అమ్ముకున్నాడని, జూట్ ఫ్యాక్టరీ నుంచి డబ్బులు తీసుకుని కార్మికులకు న్యాయం చేయ లేదని ఆరోపించారు. తనకు అక్కా, చెల్లెళ్లు, అన్నదమ్ములు లేరని, 60 లక్షల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలే తనకు అక్క, చెల్లెళ్లు, అన్నదమ్ములన్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై భగ్గుమన్న సభ్యులు

▸▸ రీ సర్వేలో తప్పులను ఎన్నిసార్లు చెప్పాలి ▸▸ భూములు లేనివారికి ఉన్నట్టుగా చూపడమేమిటి? ▸▸ ఎలమంచిలి మండల సమావేశంలో సర్పంచ్‌లు


రెవెన్యూ అధికారిని ప్రశ్నిస్తున్న సభ్యుడు నూకేశ్వరరావు


సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 17 : రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా భూముల రీ సర్వే తప్పుల తడకగా సాగిందని, ఫిర్యాదులు చేసినా పట్టించుకునేవారు కరువయ్యారని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన శనివారం ఇక్కడ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మిణీపురం సర్పంచ్ సత్తిబాబు, పులపర్తి సర్పంచ్ కొండబాబు, కృష్ణాపురం సర్పంచ్ గాంధీ, పులపర్తి కో-ఆప్షన్ సభ్యుడు నూకేశ్వరరావు రెవెన్యూ అధికారుల పనితీరును ఎత్తిచూపారు. రీ సర్వేలో భూమి లేనివారికి ఉన్నట్టు, భూమి గలవారికి తక్కువ ఉన్నట్టు తప్పులు దొర్లాయని ఆరోపించారు. వీటిని సరిదిద్దాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ఎంపీపీ గోవింద్ మాట్లాడుతూ కొం దరు రెవెన్యూ అధికారుల కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా ఉందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పులపర్తిలో జల్‌జీవన్ పథకం పైప్‌లైన్లు ఎప్పుడు వేస్తారని నూకేశ్వరరావు ప్రశ్నించారు. రేగుపాలెంలోని హిందూ శ్మశాన వాటికి ఆక్ర మణకు గురవుతుందని సర్పంచ్ మహాలక్ష్మి పేర్కొన్నారు. పురుషోత్తపురం వద్ద నిర్మిస్తున్న ప్రైవేటు పరిశ్రమ సమీపంలోని సాగునీటి కాలువ వద్ద ఏర్పాటు చేసిన పైప్‌లైన్ కారణంగా రైతులు నష్టపోతున్నారని వైస్ ఎంపీపీ రాజాన శేష వాపోయారు. ఈ సమస్యను గత సమావేశంలోనూ ప్రస్తావించినా పట్టించుకోకపోవడానికి కారణం ఏమిటని నీటిపారుదల అధికారిని ప్రశ్నించారు. అనంతరం మరికొంత మంది సమస్యలను సభదృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కొండబాబు, జడ్పీటీసీ సంధ్యారాణి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, వైస్ ఎంపీపీలు రాజాన శేష, ఎస్.ఉమాలతో పాటు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీసీలకు సీఎం జగన్‌రెడ్డి అన్యాయం : బుద్ధ


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధ నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడ నిర్వహించిన పార్టీ బీసీసెల్ నాయకుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీ కులాలకు చెందిన 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా, వాటి ద్వారా రాష్ట్రంలో ఉన్న 138 బీసీ కులాలకు చెందిన వారికి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. బీసీ కార్పొరేషన్ల ద్వారా పలు ఫైనాన్స్ సంస్థల నుంచి రూ.లక్షల కోట్ల అప్పులు తెచ్చి బీసీలకు రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై బీసీ మం త్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలు, ఎంపీలు నోరు మెదపకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో బీసీలపై దాడులు పెరిగాయన్నారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన కులగణనకు చట్టబద్ధత లేనిదని, ఇది కేవలం బీసీలను దగా చేసేందుకే తీసుకున్న నిర్ణయమన్నారు. వైసీపీని గద్దె దించేందుకు అంతా సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు గుడాల సత్యనారాయణ, బత్తుల లక్ష్మి, సబ్బి శ్రీనివాసరావు, సారిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సెజ్‌లో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంపై వైసీపీలో రగడ!

▸▸ పనుల కోసం మంత్రి, ఎమ్మెల్యే వర్గీయుల పట్టుతో నిలిపివేత

అచ్యుతాపురం, రూరల్, ఫిబ్రవరి 17 : ఇక్కడి సెజ్‌లో విద్యుత్ ఉప కేంద్రం పనుల సందర్భంగా జిల్లా మంత్రి, ఎమ్మెల్యే వర్గీయులు బాహాబాహీకి దిగడంలో స్థానిక వైసీపీ శ్రేణుల్లో అలజడి రేపుతోంది. రూ.నాలుగు కోట్ల పనులు తమకంటే తమకు కేటాయించాలని ఇరువర్గాల నాయకులు పట్టుబట్టడంతో శనివారం ప్రారంభమైన పనులు నిలిపివేశారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో 400 కేవీ సామర్థ్యం గల విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. ఈ పనులను మంత్రి అమర్‌నాథ్ వర్గీయులైన దొప్పెర్లకు చెందిన సర్పంచ్ కొరుపోలు చిన్నారావు సోదరుడు శ్రావణి గ్రూప్ అధినేత సరోజారావు దక్కించుకున్నారు. మెగా ఇంజినీరింగ్ సంస్థ నుంచి పనులు దక్కించుకున్న మంత్రి వర్గీయులు పనులు చేయడానికి గత వారం రోజులుగా ప్రయత్నిస్తున్నారు. ఈ పనులు తమకే దక్కాలంటూ ఎమ్మెల్యే కన్నబాబు వర్గీయులు లారీలను, వాహనాలను అడ్డుకుంటూ పనులను ముందుకు సాగనివ్వడం లేదని అంటున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని ప్రారంభిస్తున్నా సొంత పార్టీవారే పనులు అడ్డుకోవడం సరికాదని సరోజారావు సోదరుడు సర్పంచ్ చిన్నారావు వాపోతున్నారు. కేవలం ఎమ్మెల్యే నిర్వాసితుల ముసుగులో కంపెనీలను బెదిరించి పనులను దక్కించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు.

డిమాండ్ల సాధనకు జేఏసీ ప్రతినిధులు నిరసన


నిరసన శిబిరంలో జేఏసీ ప్రతినిధులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 17 : డిమాండ్ల పరిష్కారానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ వేదిక ప్రతినిధులు శనివారం ఎలమంచిలి పాత జాతీయ రహదారి పక్కన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు బి.వెంకటరావు, ఎ.రఘునాథస్వామి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు బకాయి ఉన్న డీఏ, పీఆర్‌సీని ప్రభుత్వ పాలనా కాలం పూర్తి కాక ముందే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. పెన్షనర్ల సంఘం నాయకులు సిహెచ్.సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం చిత్తశుద్ధితో హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఇ.ఎల్లయ్యబాబు, జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు టి.నాగేశ్వరరావు, కోశాధికారి పి.సుబ్బారావు, ప్రతినిధులు శ్రీనివాస్, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నిబంధనలు పాటించలేదని ఆందోళన



ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 17 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16వ తేదీన జరిగిన డిగ్రీ పరీక్షల్లో నిబంధనల ప్రకారం మూడు గంటలు రాయాల్సిన పరీక్షా పేపరును గంటన్నర సమయానికే ఇన్విజిలేటర్లు తీసుకోవడంతో నష్టపోయామని ఆరోపిస్తూ శనివారం ఎలమంచిలి ప్రధాన రోడ్డుపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. దీనిపై తమకు న్యాయం చేయాల్సిందిగా నినాదాలు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌ను కలిసి విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. ఏయూ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకు వెళతానని ఆయన వివరించారు. తహసీల్దార్ అప్పలరాజుకు వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ, ఎస్.రమణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివాజీ తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుని హత్య కేసు నిగ్గు తేల్చాలని ఆందోళన


ఎస్ఐకి వినతిని అందిస్తున్న నాగులాపల్లి గ్రామస్థులు

మునగపక, ఫిబ్రవరి 17 : నాగులాపల్లి యువకుడు యల్లపు మహాలక్ష్మీనాయుడు హత్యకు గురై ఏడాదిన్నర కావస్తున్నా నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారంటూ గ్రామస్థులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ మహాలక్ష్మీనాయుడు 2022 సెప్టెంబరు 12న ఇంటి నుంచి వెళ్లాడని, 14న మునగపాక సబ్ స్టేషన్ ఎదుట బెల్లం పాకలో శవమై కనిపించాడని పేర్కొన్నారు. హత్య జరిగిందని, నిందితులను త్వరలో పట్టుకుంటామని పోలీస్ అధికారులు చెప్పారని, ఇన్ని నెలలు గడిచినా కేసులో పురోగతి కనిపించకపోవడం విచారకరమన్నారు. ఈ హత్య కేసులో తమ గ్రామానికి చెందిన యువకుల హస్తం ఉందనే అనుమానాన్ని పోలీసులు పరిగణలోకి తీసుకోవడంలేదని ఆరోపించారు. అనంతరం ఎస్ఐ ప్రసాదరావుకు వినతిని అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ యల్లపు వెంకటభాస్కరరావు, సాధన సంస్థ అధ్యక్షుడు ఇస్మాయిల్, మునగపాకఉప సర్పంచ్ బొడేడ్డ అప్పలనాయుడు, గ్రామ పెద్దలు యల్లపు వెంకటఅప్పారావు, యువకుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పరిశోధనా కేంద్రం ఎదుట కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వ్యవసాయ పరిశోధనా కేంద్రం (ఆర్ఏఆర్ఎస్) ఎదుట సంస్థలో పనిచేస్తున్న కార్మికులు శనివారం ధర్నా నిర్వహించారు. కనీస వేతనాలు చెల్లించి, ఇతర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ లేబర్ కమిషన్ ఆర్డర్ ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని, జాతీయ పండగ సెలవులు కాంట్రాక్టు లేబర్ అందరికీ వర్తింపజేయాలని కోరారు. పని ప్రదేశంలో కార్మికులకు ఏ విధమైన ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులు బాధ్యత తీసుకుని వైద్యం చేయించాలని, ఖాళీ పోస్టులను భర్తీలో కాంట్రాక్టు కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలని నినాదాలు చేశారు. కొణతాల సంతోష్‌కుమార్, ఇసరపు లక్ష్మి, నక్కా మంగాదేవి, మళ్ల లక్ష్మి, పల్లా రమాదేవి, చందక లక్ష్మి పాల్గొన్నారు.

రైతుల త్యాగాలకు నిలువుటద్దం రాజధాని ఫైల్స్ సినిమా : పీలా

అనకాపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాజధాని రైతుల త్యాగాలు, పోరాటాలకు నిలువటద్దంగా రాజధాని ఫైల్స్ సినిమాను దర్శక, నిర్మాతలు తెరకెక్కించారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్‌లో శనివారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన సదరు సినిమాను తిలకించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర ప్రజలను జగన్‌రెడ్డి మోసం చేస్తున్నారన్నారు. ఇదిలావుంటే, మామిడిపాలెంలో గ్రామ దేవత దుర్గాదేవి అమ్మవారి పండగ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఎడ్ల పందాలను ప్రారంభించారు. టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, కర్రి బాబి, పోలారపు త్రినాథ్, దాడి జగన్, పిట్ల రాజు, సూరే సతీష్‌కుమార్, కొణతాల ఉమా, షేక్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

'మాదిగలకు సగం సీట్లు కేటాయించాలి'

పాయకరావుపేట, ఫిబ్రవరి 17 : రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు రాష్ట్రంలో ఉన్న ఎస్సీ నియోజకవర్గాల్లో సగం సీట్లను మాదిగలకు కేటాయించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రవి అనంత్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 29 ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు ఉన్నాయని, వీటిలో మాదిగలకు 50 శాతం సీట్లను కేటాయించి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు డొక్కా అజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి సీహెచ్.దేవుడుతోపాటు నాయకులు పలివెల శివమణి, రమేష్, సతీష్, సరేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

▸▸ ఎంపీడీవోలకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 17 : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఎంపీడీవోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వివిధ గ్రాంట్లు కింద విడుదలైన నిధులను వేగంగా ఖర్చు చేయాలన్నారు. ప్రాధాన్యత భవనాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే పూర్తి కావచ్చిన పనులను గుత్తేదారులతో మాట్లాడి వేగంగా జరిగేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పనులు అవసరమైన చోట ఉపయోగపడేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డీపీవో శిరీషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్నకు విశేష పూజలు


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి, ఫిబ్రవరి 17 : ఉపమాక వేంకటేశ్వరఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. తెల్లవారుజామున కొండపై వున్న స్వామి నిజరూపానికి అర్చకులు అభిషేకం చేసి, ధూప, దీప, నైవేద్య నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. కింద ఆలయంలో ఉభయదేవేరులతో కూడిన స్వామివారికి పూజలు, నిత్య హోమాలు జరిపారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, రంగాచార్యులు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిపారు.

'మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

నక్కపల్లి, ఫిబ్రవరి 17 : మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని జాతీయ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొవిరి వెంకటేశ్ డిమాండ్ చేశారు. శనివారం నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ ఏపీలో ఈ నెలలోనే మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఇందుకు రాజ్యసభ,లోక్‌సభల్లో బిల్లులు ప్రవేశపెట్టి రాష్ట్రపతి ఆమోదానికి పంపాలని కోరారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన నాయకులు, అధికారంలోకి వచ్చి ఐదేళ్లు ముగుస్తున్నా ఇప్పటి వరకూ ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవడం దారుణమన్నారు. రానున్న ఎన్నికల్లో మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చుతామంటూ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

'హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌తో మహిళలకు మేలు'

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 17 : హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌తో స్త్రీలలో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌ను నివారించవచ్చని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు దిగుమర్తి రఘునాథరావు, లీల దిగుమర్తి అన్నారు.పెదరాంభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనువాసరావు ఆధ్వర్యంలో శనివారం అమెరికాలోని బోస్టన్‌కు చెందిన మానవసేవ అనే స్వచ్ఛంద సంస్థ, హైదరాబాద్‌లోని ఈసీకే అభివృద్ధి సంస్థ సంయుక్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా తొమ్మిది సంవత్సరాలు నిండిన సుమారు 180 మంది విద్యార్థినులకు ఉచితంగా ఈ వ్యాక్సిన్ మొదటి డోసు టీకాలను వేశారు. వంద మంది తల్లులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు పి.శ్రీనివాసులురెడ్డి, జె.శరత్, వి.ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

కృష్ణంపాలెంలో పశు వైద్య శిబిరం

రాంబిల్లి, ఫిబవరి 17 : కృష్ణంపాలెంలో శనివారం హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డెయిరీ మేనేజర్ కూండ్రపు శేష ప్రారంభించి మాట్లాడారు. పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా డెయిరీ పనిచేస్తున్నట్టు చెప్పారు. వెటనరీ డాక్టర్ మనోజ్‌కుమార్, అసిస్టెంట్ సిహెచ్.రాము తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి రత్నాకర్ విగ్రహాలు అందజేత

కశింకోట (అనకాపల్లి), ఫిబ్రవరి 17 : పరవాడపాలెంలో నూతనంగా నిర్మించిన రామాలయానికి టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ తన సొంత నిధులతో విగ్రహాలను శనివారం అందజేశారు. తొలుత గ్రామ పురవీధుల్లో విగ్రహాలను ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. టీడీపీ నాయకులు ఉగ్గిన రమణమూర్తి, వేగి దొరబాబు, ఆలయ ప్రతినిధులు బలిజ ముసిలినాయుడు, గొంతిన లోవ అప్పారావు, మడకా నాగేశ్వరరావు, గొంతిన గంగాధర్ పాల్గొన్నారు.

ఓపీఎస్ పునరుద్ధరణకు యూటీఎఫ్ వినతి

అనకాపల్లి , ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌ను టీడీపీ మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ శనివారం సాయంత్రం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావుకు యూటీఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చిన బ్బాయి మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేస్తానని హామీ ఇచ్చి విస్మరించడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రం ఇస్తున్నట్టు చెప్పారు. ఈ విషయాన్ని తమ పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్తామని నాగజగదీశ్వరరావు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వత్సవాయి శ్రీలక్ష్మి, దేముడునాయుడు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులపై ఆంక్షలు

... 5వ పేజీ తరువాయి

చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఎస్ఈఏ మండల అధ్యక్షుడికి..

నాతవరం, ఫిబ్రవరి 17: 'ఛలో విజయవాడ' కార్యక్రమానికి వెళ్లవద్దంటూ నాతవరం పోలీసులు శనివారం మండలంలోని చమ్మచింత ప్రాథమిక పాఠశాలకు వెళ్లి సీపీఎస్ఈఏ మండల అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు అయిన జగన్నాథరావుకు నోటీసు ఇచ్చారు. విజయవాడలో ధర్నాకు హాజరైతే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని నోటీసులో పేర్కొన్నారు. తమ హెచ్చరికను బేఖాతరుచేసి విజయవాడ వెళితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రోయిన్లపై పాలకులు నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

తరువాత 2021వ సంవత్సరం వరకు గ్రోయిన్ల మరమ్మతు ఊసే లేదు. 2021-22లో జలవనరుల శాఖ ఇంజనీర్లు రూ.5.2 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ నిధులు విడుదల కాలేదు. తరువాత 2022-23లో గ్రోయిన్ల మరమ్మతు కోసం రూ.7.5 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపారు. ఈసారి కూడా అదే పరిస్థితి. అదే విధంగా 2023-24లో రూ.8.8 కోట్లు అంచనాలతో ప్రతిపాదనలు పం పారు. నిధుల కేటాయింపునకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం రాలేదు. కాగా గ్రోయిన్లకు మరమ్మతులు చేయించకపోవడంపై జిల్లా జలవనరుల శాఖ అధికారి త్రినాథంను వివరణ కోరగా... సాగునీటి జలాశయాల కాలువల ఆధుకీకరణ, గ్రోయిన్ల మరమ్మతు పనులకు నిధులు మంజూరు కోసం ఏటా ప్రతిపాదనలు పంపుతున్నామని చెప్పారు. అయితే ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేపట్టలేకపోతున్నామని చెప్పారు. నిధులు మంజూరైతే టెండర్లు పిలిచి పనులు నిర్వహిస్తామని తెలిపారు.

రాజుపాలెంలో ముగిసిన రథసప్తమి వేడుకలు


పూజలందుకున్నస్వామి


ఆధ్యాత్మిక, సాంస్కృతి కార్యక్రమాలకు హాజరైన భక్తజనం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 17 : జిల్లాలోని ప్రసిద్ధి చెందిన రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా ముగిశాయి. శుక్రవారం వేకువజాము నుంచి స్వామివారికి పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల అనం తరం బాణసంచా కల్చులతో వేడుకలు పూర్తయ్యాయి. అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో కోలాహలం నెలకొంది. రూరల్ సీఐ ధనుంజయరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

▸ శంఖారావం సభకు భారీగా తరలివచ్చిన జనం
▸ రానున్న ఎన్నికల్లో విజయమే ధ్యేయమని ప్రతిజ్ఞ

లోకేశ్‌కు నీరాజనం

టీడీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన యువ నేత

శంఖారావం పేరట తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ నిర్వహిస్తున్న సభలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. విజయనగరం జిల్లాలో పర్యటనను ముగించుకుని శనివారం మధ్యాహ్నం జిల్లాలో ప్రారంభించిన కార్యక్రమానికి జనం అడుగడుగునా హారతులు పట్టారు. పెందుర్తి మండలం కృష్ణరాయపురం, భీమిలి మండలం చిట్టివలసలో జరిగిన సభలకు పార్టీ శ్రేణులతో పాటు వివిధ వర్గాల ప్రజలు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం దిశగా తీసుకోవాల్సిన చర్యలపై శ్రేణులకు లోకేశ్ దిశా నిర్దేశం చేశారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


చిట్టివలస సభలో లోకేశ్ ప్రసంగానికి కేరింతలు కొడుతున్న టీడీపీ శ్రేణులు, అభిమానులు


వేదికపై లోకేశ్ విజయ శంఖారావం


కృష్ణరాయపురం శంఖారావం సభా వేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న లోకేశ్, బండారు, తదితరులు


కృష్ణరాయపురం వేదిక వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న లోకేశ్


వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో నారా లోకేశ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు


చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారెంటీల కరపత్రాలను ప్రదర్శిస్తున్న మహిళా కార్యకర్తలు


పెందుర్తి నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న లోకేశ్


జాలరి వల, బుంగను బహూకరిస్తున్న నూకరాజు


లోకేశ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న జనసేన నేత పంచకర్ల సందీప్


చిట్టివలస సభా వేదికపై లోకేశ్‌తో చర్చిస్తున్న శ్రీభరత్ చిత్రంలో పంచకర్ల సందీప్ ఉన్నారు


భీమిలి నియోజకవర్గ నాయకులకు దిశా నిర్దేశం చేస్తున్న లోకేశ్


వెంకటాపురం సమస్యలపై లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు


ప్రతిజ్ఞ చేస్తున్న లోకేశ్, బండారు, బుద్దా నాగజగదీశ్, పంచకర్ల, పీలా శ్రీనివాసరావు


చిన్నారులతో సరదాగా...


లోకేశ్‌కు అంబేద్కర్ విగ్రహాన్ని బహూకరిస్తున్న పార్టీ కార్యకర్తలు

క్రైం... crime news

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

చింతపల్లి, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలోని పెదపైపువీధిలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పెదపైపువీధికి చెందిన రమేశ్, చింత నందిని (23) దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమేశ్ తాపీమేస్త్రీగా పనిచేస్తుండగా, నందిని గృహిణి. రోజు మాదిరిగానే రమేశ్ శనివారం ఉదయం పనికి వెళ్లిపోయాడు. సాయంత్రం గృహానికి వచ్చేసరికి భార్య ఉరి వేసుకుని కనిపించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు వచ్చి చూడగా అప్పటికే నందిని మృతి చెందింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు ఎస్ఐ కె.అరుణ్ కిరణ్ తెలిపారు.

తహసీల్దార్ రమణయ్య బంధువు రాజేంద్ర మృతి

▸ గుండెపోటు వల్లే చనిపోయినట్టు కుటుంబ సభ్యుల వెల్లడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల రెండో తేదీన హత్యకు గురైన తహసీల్దార్ సనపల రమణయ్యకు బంధువుగా చెప్పుకున్న ప్రధాన రాజేంద్ర (47) శుక్రవారం రాత్రి మృతిచెందారు. ప్రసాద్ అనే వ్యక్తి తనకు ఫోన్ చేసి చీపురుపల్లిలోని తమ భూమిలో అడుగుపెట్టొద్దని, అడుగు పెట్టినట్టయితే చంపేస్తానని బెదిరించారంటూ తహసీల్దార్ హత్య జరిగిన మరుసటిరోజు రాజేంద్ర మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే. తనను బెదిరించిన ప్రసాదే తనకు వరుసకు సోదరుడయ్యే తహసీల్దార్ రమణయ్యను హత్య చేసి ఉంటాడని రాజేంద్ర అనుమానం వ్యక్తంచేశారు. అయితే రమణయ్యను హత్య చేసింది మురారి సుబ్రహ్మణ్యం గంగారావు అని పోలీసుల దర్యాప్తులో తేలింది. అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఇదిలావుండగా తహసీల్దార్ బంధువుగా చెప్పుకుంటున్న ప్రధాన రాజేంద్ర శుక్రవారం మృతిచెందడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు, ప్రసాద్, తదితరుల ఒత్తిళ్లను తట్టుకోలేకే రాజేంద్ర మృతిచెందాడంటూ ప్రచారం జరిగింది. అయితే రాజేంద్ర భార్య త్రివేణి మాత్రం తన భర్తకు గుండెపోటు రావడం వల్లే మృతి చెందారని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టంచేశారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కోటపాటు కొత్తూరుకు చెందిన ప్రధాన రాజేంద్ర పదేళ్ల కిందట విశాఖ వచ్చి ఎంవీపీకాలనీలోని గాదిరాజు ఎంపైర్స్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. భార్య త్రివేణితోపాటు ఏడేళ్ల కుమార్తె ఉంది. రాజేంద్ర కొంతకాలం కిందటి వరకూ అనకాపల్లిలో మహీంద్ర ట్రాక్టర్ల షోరూమ్ నిర్వహించేవారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగుతున్నారు.

కాగా త్రివేణి కథనం ప్రకారం...మధుమేహం కలిగి ఉన్న రాజేంద్ర శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఒక్కసారిగా షుగర్ లెవెల్స్ పెరిగిపోవడంతో కుప్పకూలిపోయారు. వెంటనే షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించామని, అక్కడ చికిత్స పొందుతూ రాత్రి పది గంటల సమయంలో మృతిచెందారు. కార్డియాక్ అరెస్టు వల్లే రాజేంద్ర మృతిచెందినట్టు వైద్యులు కూడా నిర్ధారించారన్నారు. తన భర్త అంత్యక్రియలు కూడా పూర్తయినందున ఆ విషయాన్ని అక్కడితో వదిలేయాలని ఆమె కోరారు. తన భర్త మృతి చెందడంతో ఏడేళ్ల కుమార్తెతో ఎలా బతకాలో తెలియని స్థితిలో ఉన్న తమను కొన్ని టీవీ ఛానల్స్ తప్పుడు వార్తలు ప్రసారం చేసి మనోవేదనకు గురిచేస్తున్నారని వాపోయారు. ఏదైనా లేనిపోని అనుమానాలతో కథనాలు ప్రసారం చేస్తే ఆయా మీడియా సంస్థల పేరు చెప్పి తన కుమార్తెతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం ఒక్కటే తనకు మార్గమని త్రివేణి ఆవేదన వెళ్లగక్కారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

సైకో సీఎం పాలనలో క్రీడలకూ గ్రహణం

▸ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో 'అయ్యన్న'


పోటీలను ప్రారంభిస్తున్న అయ్యన్నపాత్రుడు


తూర్పు గోదావరి, విజయనగరం జట్ల మధ్య పోటీ

మునగపాక, ఫిబ్రవరి 17 : రాష్ట్రాన్నే కాదు.. క్రీడలకూ గ్రహణం పట్టించిన సైకో ముఖ్యమంత్రి దొరకడం ప్రజలు చేసుకున్న దురదృష్టమని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో శనివారం రాత్రి మాజీ ఎంపీ పెతకంశెట్టి అప్పలనరసింహం 88వ జయంతి సందర్భంగా నారా లోకేష్ యువగళం కప్ రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలకు మన రాష్ట్రానికి ఒక ప్రత్యేకత ఉండేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక రూ.వంద కోట్లతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారని, క్రీడలను చూద్దామని టీవీ ఆన్ చేస్తే బ్యాట్ పట్టుకుని సైకో ముఖ్యమంత్రి, మరోవైపు బ్యాట్ పట్టుకుని మంత్రి రోజా వీరిద్దరే ఆడుకుంటున్నారని క్రీడాకారులను చూపించలేదని ఎద్దేవా చేశారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ చాలా ప్రభుత్వాలు వచ్చినా ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమే క్రీడలకు ప్రోత్సాహం అందించిందన్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ యువకుల ఆటల కోసం తాను పరవాడలో స్టేడియం నిర్మిస్తే, ప్రస్తుత ఎమ్మెల్యే దీనిని ప్రారంభించి అద్దెకు ఇచ్చుకున్నారన్నారు. అనకాపల్లిలో స్టేడియాన్ని కూడా కోడిగుడ్డు మంత్రి భ్రష్టు పట్టించారని ఎద్దేవా చేశారు. పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా నాయకుడు దాడి రత్నాకర్, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, నాయకులు బీమరశెట్టి శ్రీనివాసరావు, దాడి ముసిలినాయుడు, ధూళి రంగనాయకులు, మొల్లేటి సత్యనారాయణ, రాజునాయుడు, మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం తదితరులు పాల్గొన్నారు. అనంతరం తూర్పు గోదావరి, విజయనగరం మహిళా జట్లు హోరాహోరీగా తలపడ్డాయి.

మహిళలు చట్టాలను వినియోగించుకోవాలి

▸ జిల్లా జడ్జి శ్రీవిద్య



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీవిద్య

అనకాపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలు పోస్కో చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పదవ అదనపు జడ్జి శ్రీవిద్య సూచించారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం మహిళలకు సదరు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా మంది చట్టాలను ఉపయోగించుకోవడంలో నిర్లిప్తతగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మహిళా రక్షణకు అనేక చట్టాలను ప్రవేశ పెట్టాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప, రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, డీఈవో లక్ష్మమ్మ, ప్రెసిడెంట్ సాయి, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ, లక్ష్మణ్, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టించే వారిపై బైండోవర్ : ఎస్పీ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 17 : రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అల్లర్లు, సమస్యలను సృష్టించే వారిని, పాత నేరస్థులను ముందుగా గుర్తించి బైండోవర్ చేయాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం రాత్రి నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ఏడాది కావడంతో జిల్లాలోని ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసులు నడుం బిగించాలన్నారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ముఖ్యమైన కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఏఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే రహదారి భద్రత సాధ్యం : కలెక్టర్

అనకాపల్లి , ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అవగాహనతోనే రహదారి భద్రత సాధ్యమని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. రహదారి భద్రతా దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని తొలుత కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. రింగురోడ్డు నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరిలో అవగాహన కలిగించడం మూలంగానే రహదారి భద్రత సాధ్యమవుతుందన్నారు. రోడ్లు, ట్రాఫిక్ లైట్లు, చిహ్నాలు పాడైతే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించడం, వాహనదారులు, ప్రయాణికులు, బాటసారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించడం వంటివి చేయాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి, డ్రైవర్లను అప్రమత్తం చేస్తున్నట్టు చెప్పారు. జరిమానాలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాల సంఖ్య తగ్గిందన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, రవాణాశాఖ జిల్లా అధికారి కె.ప్రకాశరావు, డీపీఎం సభ్యుడు అప్పారావు, ఆటో డ్రైవర్లు, వలంటీర్లు, విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల విధులపై పోలీసులకు శిక్షణ

అనకాపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్ర జ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతంగా విధులను నిర్వహిం చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. ఇక్కడి రోటరీ కల్యాణ మండపంలో ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధిత అంశాలపై శనివారం ఏర్పాటైన శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ, విధి విధానాలు, ఎన్నికల నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళి, ఎన్నికలకు సంబంధించిన చట్టాలను వివరించారు. గంజాయి రవాణా, అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువులు సీజ్ చేయడం, తరుచూ గ్రామాలను సందర్శించి సమాచారం చేయాలన్నారు. పరవాడ, అనకాపల్లి డీఎస్పీలు కేవీ సత్యనారాయణ, వి.సుబ్బరాజు, ట్రైనీ డీఎస్పీ భవ్య, ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, గణేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

టెన్త్‌లో ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి చేయండి: డిప్యూటీ డీఈవో



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

నర్సీపట్నం, ఫిబ్రవరి 17: పదో తరగతి పరీక్షల్లో ఉత్తీరత శాతం పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు సూచించారు. బలిఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు రాత్రి సమయాలలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జి.నాగేంద్ర, ప్రధానోపాధ్యాయులు పి.అచ్యుతం, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలిరండి

గొలుగొండ, ఫిబ్రవరి 17: సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి తరలిరావాలని ఏపీ సీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.రవీంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు జోగంపేట ఉన్నత పాఠశాలలో శనివారం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో సీపీఎస్ ఉద్యోగులకు ఇచ్చిన మాట తప్పారన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, మల్లేశ్వరరావు, కుమారి, మహాలక్ష్మి, బానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

జోగంపేటలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

గొలుగొండ, ఫిబ్రవరి 17: మండలంలోని జోగంపేట గ్రామంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం రాత్రి నుంచి అట్టహాసంగా ఉత్సవాలను ప్రారంభించారు. ఆదివారం రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 17: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన అవసరమని బీజేపీ మండల అధ్యక్షుడు సిహెచ్.గౌరీనాయుడు అన్నారు. కృష్ణాదేవిపేటలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చేతివృత్తి దారులు ఈ పథకంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెలగా జగన్నాథ్, మండల కార్యదర్శి పల్లా రమణాయాదవ్, నర్సీపట్నం ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్, అల్లూరి జిల్లా నాయకులు రేమాల చంద్రరావు, అరిమెల రాజు తదితరులు పాల్గొన్నారు.

తాండవ గేట్లకు మరమ్మతులు చేపట్టాలని జనసేన దీక్షలు

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 17: తాండవ రిజర్వాయర్ ప్రధాన గేట్ల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం శాంతియుత నిరసన దీక్షలు చేపట్టారు. ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర మాట్లాడుతూ గేట్ల మరమ్మతులు చేపట్టాలని ఎన్నోసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో ఇటీవల వర్షాభావ పరిస్థితుల్లో సుమారు 28 వేల ఎకరాల వరకు పంట పొట్టదశలో ఎండిపోయిన దుస్థితి దాపురించిందన్నారు. స్థానిక శాసన సభ్యులు కనీసం గేట్ల మరమ్మతులపై కూడా ఎటువంటి దృష్టిసారించకపోవడం దారుణమన్నారు. కనీసం రూ.7 లక్షలు కేటాయించలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఆయన ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అద్దెపల్లి గణేష్, వెలగల వెంకటరమణ, మోపాడ చిరంజీవి పాల్గొన్నారు.



శాంతియుత నిరసన దీక్షలు చేపడుతున్న జనసేన పార్టీ నాయకులు

సీపీఎస్, జీపీఎస్ కాదు.. ఓపీఎస్ కావాలి

▸ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

మాకవరపాలెం, ఫిబ్రవరి 17: సీపీఎస్, జీపీఎస్‌లు కాకుండా ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్) మాత్రమే ఉపాధ్యాయలకు కావాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ స్పష్టం చేశారు. తామరం రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎం.శేషగిరిరావు ఇంటి వద్ద శనివారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయలను ఇబ్బంది పెట్టే ఏ ప్రభుత్వమూ నిలబడలేదని చరిత్ర చెబుతుందన్నారు. పాఠశాలలో ఒత్తిడి తట్టుకోలేక ఎందరో ఉపాధ్యాయలు ఆసుపత్రి పాలువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం డీఏలు కూడా ఇవ్వలేని దుస్థితి ఈ ప్రభుత్వం ఉందని వాపోయారు. భవిష్యత్తులో ఇలాగే వేధింపులు కొనసాగిస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీరామూర్తి, కార్యదర్శి మల్లేశపాదం, సభ్యులు సత్యారావు, పి.ఆదినారాయణ, చక్రవర్తి, ఎం.శేషగిరిరావు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

నర్సీపట్నం, ఫిబ్రవరి 17: ఉద్యోగుల బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీ ఎన్‌జీవోస్ సంఘం అధ్యక్షుడు చింతకాయల శ్రీనివాసరావు, కార్యదర్శి జీవి రమణబాబు డిమాండ్ చేశారు. ఇందుకోసం జల వనరుల శాఖ డివిజినల్ కార్యాలయం వద్ద శనివారం ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్స్ కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీకి సంబంధించి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కృష్ణ, రామచంద్ర పాల్గొన్నారు.

తాండవ గేట్ల మరమ్మతులకు రూ.9 లక్షలు

నర్సీపట్నం, ఫిబ్రవరి 17: తాండవ రిజర్వాయర్ గేట్ల మరమ్మతులు కోసం గత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రూ.9 లక్షలు మంజూరు చేసిందని జల వనరుల శాఖ ఇన్‌చార్జి ఈఈ స్వామినాయుడు చెప్పారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తాండవ గేట్లు లీకేజీ సమస్య అరికట్టడానికి ఈ నిధులను లక్షలు మంజూరు చేయగా, టెండరు ప్రక్రియ కూడా చేపట్టామని చెప్పారు. మొదటిసారి టెండర్లు పిలిచినప్పుడు ఎవరూ ముందుకు రాకపోవడంతో, రెండోసారి శుక్రవారం పలిచామని తెలిపారు. తాండవ ప్రాజెక్టు నాలుగు పంట కాలువలలో పూడికతీత పనులకు రూ.8 లక్షలు చొప్పున రూ.32 లక్షలు మంజూరు అయ్యాయని ఈఈ వివరించారు.

23న అడవిరాజుబాబులు పండగ

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 17: స్థానిక అల్లూరి పార్కు వద్ద అడవిరాజుబాబుల ఆలయంలో ఈ నెల 23న పండగ నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త కె.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా పలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ధర్మకర్త రామారావు కోరారు.

ఆర్థిక రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నాడని దుయ్యబట్టారు. తాము విశాఖను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయడంతో పాటు ఫ్లై ఓవర్‌లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని, ఉద్యోగం వచ్చేవరకు మూడు వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. భీమిలి నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, 2019 ఎన్నికల్లో తనను ఇక్కడి నుంచి పోటీ చేయాల్సిందిగా చంద్రబాబు చెప్పారన్నారు. మూడు దశాబ్దాల నుంచి టీడీపీ గెలవని స్థానాన్ని కోరి మరీ మంగళగిరి నుంచి తాను పోటీ చేశానని, స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యానన్నారు. భీమిలి నుంచి పోటీ చేస్తే తనతోపాటు భరత్ కూడా నెగ్గేవాడని, ఆ మాట ఇప్పటికీ భరత్ చెబుతుంటాడన్నారు. భవిష్యత్తులో కూడా భీమిలిని అభివృద్ధి చేసే బాధ్యతను తాము తీసుకుంటామని స్పష్టం చేశారు. 2014 నుంచి 2019 వరకు ఇక్కడ వేయి కోట్ల అభివృద్ధి పనులు చేశామని, ఇండోర్ స్టేడియం, మిలీనియం టవర్ ఏర్పాటు చేయడంతోపాటు టిడ్కో ఇళ్లను నిర్మించామన్నారు. 2019లో భీమిలి నియోజకవర్గ ప్రజలు పాలిచ్చే ఆవును కాదని, తన్నే దున్నపోతును గెలిపించుకున్నారన్నారు. అర గంట అవంతి మంత్రిగా పనిచేసినా ఇక్కడి అభివృద్ధి పనులు చేయలేదని, ప్రజల జీవితాల్లో మార్పులు రాలేదన్నారు. ఆయనకు రాసలీలలు మాత్రమే తెలుసునని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకులు అవినీతికి కేరాఫ్‌గా భీమిలిని మార్చారని, అరగంట అవంతి అవినీతి పెరిగిపోయిందని, అనేక పోస్టులు అమ్ముకున్నాడని, జూట్ ఫ్యాక్టరీ నుంచి డబ్బులు తీసుకుని కార్మికులకు న్యాయం చేయలేదని ఆరోపించారు. తనకు అక్కా, చెల్లెళ్లు, అన్నదమ్ములు లేరని, 60 లక్షల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలే తనకు అక్క, చెల్లెళ్లు, అన్నదమ్ములన్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్

... 5వ పేజీ తరువాయి

పెందుర్తి మండలం కృష్ణరాయపురం ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. చంద్రబాబు హయాంలో నగరానికి ఐటీ పరిశ్రమలు, అదానీ డేటా సెంటర్, మెడ్‌టెక్ జోన్ తీసుకువచ్చారని, జగన్ పాలనలో భూకబ్జాలు, కిడ్నాప్‌లు, దోపిడీలు, చెరువుల ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్ అని వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్రను దోచుకునేందుకు బొత్స, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి కుటుంబాలకు లైసెన్స్ ఇచ్చారన్నారు. వీరంతా పందికొక్కులా దోచుకున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని జగన్ చూస్తున్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం వచ్చిన వెంటనే విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. టీడీపీ, జనసేన కేడర్ మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు.

జగన్‌ది రాజారెడ్డి రాజ్యాంగం

తాను బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి లోబడి పనిచేస్తానని, అదే జగన్ మాత్రం రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. తాను ప్రజల్లో తిరుగుతుంటే జగన్ మాత్రం పరదాల మాటున పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రిగా తాను టీసీఎల్, హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్, జోహో..వంటి పరిశ్రమలు తీసుకువస్తే జగన్ బూమ్‌బూమ్, ప్రెసిడెంట్ మెడల్ వంటి మద్యం బ్రాండ్లు తీసుకువచ్చారన్నారు.

నవ మోసాలు

ఎన్నికల ముందు నవరత్నాలు అని ఊదరగొట్టిన జగన్, అధికారంలోకి వచ్చిన తరువాత దానిని నవ మోసాలుగా చేశారని లోకేశ్ ధ్వజమెత్తారు. మద్య నిషేధం చేసిన తరువాతే ఓట్లు అడుగుతానని ప్రజలను నమ్మించిన వ్యక్తి.. మాట తప్పడమే కాకుండా నేడు వీధివీధినా మద్యం అమ్ముతున్నారన్నారు. ప్రజల కష్టాలు చూసి చంద్రబాబు సూపర్ సిక్స్ ప్రకటించారని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించారు. బూత్ స్థాయి అధ్యక్షులు, ముఖ్యమైన నాయకులు రానున్న రెండు నెలల్లో ప్రజల్లోకి వెళ్లి సూపర్ సిక్స్ కోసం ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సభలో పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బండారు సత్యనారాయణమూర్తి, జనసేన రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి కేడర్‌కు లోకేశ్ సూపర్ సిక్స్ కిట్లు పంపిణీ చేశారు.

పేట వైసీపీలో తిరుగుబాటు!

... 5వ పేజీ తరువాయి

స్పందించి వచ్చే ఎన్నికల్లో పాయకరావుపేట ఎమ్మెల్యే టికెట్‌ను స్థానికులకు కేటాయిస్తే కచ్చితంగా గెలిపించుకుంటామని తెలిపారు. వైసీపీ నాయకుడు దేవవరపు సూర్యచక్రం మాట్లాడుతూ, పాయకరావుపేటకు చెందిన కొంతమంది వైసీపీ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి తమ స్వప్రయోజనాల కోసం పార్టీ అభివృద్ధికి కష్టపడే వారిని అణగదొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 పల్లెల మణికంఠస్వామి, వైసీపీ నాయకులు కాదా రామకృష్ణ, గోసల కృష్ణ, ధనిశెట్టి బుజ్జి, కోనే పుత్రయ్య, రామగోవిందు, నేలపర్తి అర్జున్, వెంకటసూరి, కె.సత్తిబాబు పాల్గొన్నారు.

గ్రోయిన్లపై పాలకులు నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

తరువాత 2021వ సంవత్సరం వరకు గ్రోయిన్ల మరమ్మతు ఊసే లేదు. 2021-22లో జలవనరుల శాఖ ఇంజనీర్లు రూ.5.2 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ నిధులు విడుదల కాలేదు. తరువాత 2022-23లో గ్రోయిన్ల మరమ్మతు కోసం రూ.7.5 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపారు. ఈసారి కూడా అదే పరిస్థితి. అదే విధంగా 2023-24లో రూ.8.8 కోట్లు అంచనాలతో ప్రతిపాదనలు పంపారు. నిధుల కేటాయింపునకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం రాలేదు. కాగా గ్రోయిన్లకు మరమ్మతులు చేయించకపోవడంపై జిల్లా జలవనరులశాఖ అధికారి త్రినాథంను వివరణ కోరగా.. సాగునీటి జలాశయాల కాలువల ఆధునీకరణ, గ్రోయిన్ల మరమ్మతు పనులకు నిధులు మంజూరు కోసం ఏటా ప్రతిపాదనలు పంపుతున్నామని చెప్పారు. టెండర్లు పిలిచి పనులు నిర్వహించనున్నట్టు చెప్పారు.

చోడవరం
నియోజకవర్గం

స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి



శిక్షణలో పాల్గొన్న మహిళలు

రోలుగుంట, ఫిబ్రవరి 17 : మహిళలు స్వయం ఉపాధిపై దృష్టిసారించాలని సేవా భారత్ కోఆర్డినేటర్ జీవీరావు కోరారు. మండలంలోని బుచ్చెంపేటలో స్థానిక వయోజన విద్యాకేంద్రంలో చదువుకుంటున్న 30 మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధిపై మహిళలు దృష్టి సారిస్తే ఆర్థికంగా ఎదిగేందుకు వీలవుతుందన్నారు. ఖాళీ సమయాల్లో కొన్ని రకాల ఉత్పత్తులను తయారు చేసి వాటిని వి క్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు ఫినాయిల్, సర్ఫ్, నీలిమందు, హెర్బల్ హెయిర్ ఆయిల్‌లతో పాటు వివిధ రకాల ఉత్పత్తులను తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.స్టీఫాన్, సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గౌరీపరమేశ్వరుల జాతర

రోలుగుంట, ఫిబ్రవరి 17: మండలంలోని కొవ్వూరులో ఆదివారం గౌరీ పరమేశ్వరుల జాతర మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని కోరారు. అనుపు మహోత్సవం సోమవారం ఉంటుందన్నారు.



కొవ్వూరులో గౌరీ పరమేశ్వరులు

ఆరోగ్య శ్రీ పేదలకు వరం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 17: పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరం అని ఐకేపీ ఏపీఎం బాలరాజు అన్నారు. ఆయన శుక్రవారం వడ్డాది పంచాయితీ ఆవరణలో జరిగిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. కుటుంబంలో ఒక వ్యక్తికి రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తారన్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో ఆరోగ్య శ్రీ యాప్ అని డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. వైసీపీ నేత దొండా నారాయణమూర్తి, పంచాయతీ ఈఓ లవరాజు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, సమాఖ్య సంఘ సభ్యులు, సీసీకె గణపతి, వీఓఏలు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా కమిటీలో ఆరుగురుకి చోటు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 17: వైసీపీ జిల్లా కమిటీలో మండలానికి చెందిన ఆరుగురికి చోటు లభించింది. జిల్లా పార్టీ సంయుక్త కార్యదర్శిగా బుచ్చెయ్యపేటకి చెందిన సుంకర గాంధీ, జిల్లా పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షుడిగా, పెదమదినాకి చెందిన జోగా కొండబాబు, రైతు విభాగం ఉపాధ్యక్షుడిగా దిబ్బిడికి చెందిన గొంపా అప్పారావు, జిల్లా యువజన ఉపాధ్యక్షుడిగా నీలకంఠాపురానికి చెందిన యన్నంశెట్టి రవికుమార్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా వడ్డాదికి చెందిన కోరుకొండ రమణ నియమితులయ్యారు.

లోకేశ్ శంఖారావం సభను విజయవంతం చేయాలి

▸ టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ ▸ డి.సురవరం గ్రామంలో సభా స్థలి పరిశీలన



స్థల పరిశీలనలో నాయకులు పీవీజీ కుమార్, రామానాయుడు తదితరులు



వడ్డాదిలో సభ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, టీడీపీ నేతలు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 17: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈ నెల 20 తేదీన చేపట్టనున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పిలుపునిచ్చారు. మాడుగుల మండలం డి.సురవరం గ్రామ సమీపంలో లోకేశ్ నిర్వహించనున్న శంఖారావం సభా స్థలిని శనివారం ముఖ్య నాయకులతో కలిసి వారు పరిశీలించారు. వడ్డాది పాడేరు ఆర్‌అండ్‌బీ మెయిన్‌రోడ్డులో ఘాట్‌రోడ్డు జంక్షన్ డి.సురవరం గ్రామాల మధ్యగల ఖాళీ ప్రదేశంలో సభను ఏర్పాటు చేస్తున్నారు. ఆరువేల మంది హాజరు కానున్నందున తగిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అద్దిపల్లి జగ్గారావు, పుప్పాల అప్పలరాజు, ఉండూరు దేముడు , సన్యాసిరావు, చిన్నంనాయుడు, తాతారావు పాల్గొన్నారు.

వడ్డాదిలో....

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో సోమవారం జరగనున్న లోకేశ్ శంఖారావం సభ స్థలాన్ని శనివారం కొత్తకోట సీఐ అప్పలనాయుడు, బుచ్చెయ్యపేట ఎస్ఐ డి. ఈశ్వరరావు టీడీపీ నాయకులతో కలసి శనివారం పరిశీలించారు. లోకేష్ సభలో ఎంత మంది పాల్గొననున్నారు? చేపడుతున్న చర్యలను సీఐ.. టీడీపీ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబుని అడిగి తెలుసుకున్నారు. సభ ప్రశాంతంగా జరగడానికి వలంటీర్లను నియమించాలని, బీఎన్ రోడ్డుపై రవాణాకి ఇబ్బంది లేకుండా, వాహనాలు పార్కింగ్‌లో నిలపాలని, వీఐపీలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, తదితర పలు సూచనలు చేశారు. బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, గోకివాడ కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఎంవివి.సత్యనారాయణ, నాయకులు తమరాన దాసు, సాయం శేషు, దొండా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే భవిష్యత్తు

▸ పూర్వ వీసీ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు

చీడికాడ, ఫిబ్ర వరి 17: ఇష్టపడి చది వితే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉం టుందని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్స లర్ ముర్రు ముత్యాల నాయుడు అన్నారు. మండలంలోని అప్పల రాజుపురం హైస్కూల్‌లో ఇటీవల సత్యసాయి సేవాసంస్థ నిర్వహించిన వ్యాస రచన పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు, మెమెంటోలను ముత్యాలనాయుడు చేతులమీదుగా అందించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆట పాటల్లోను రాణించాలన్నారు. సత్యసాయి సేవా సంస్థ నిర్వాహకులు కసిరెడ్డి అప్పలనాయుడు, బొడ్డు సుధాకర్ నాయుడు, తగరంపూడి నూకరాజు, కురచ లక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య వైఖరి

▸ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, పెన్షనర్ల నిరాహార దీక్ష



జేఏసీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలో ఉద్యోగులు, పెన్షనర్లు

చోడవరం, ఫిబ్రవరి 17: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యవైఖరిని వ్యతిరేకిస్తూ జేఏసీ పిలుపు మేరకు శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు పెన్షనర్లు రిలేనిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలపై చర్చల పేరిటతాత్సార వైఖరి అవలంభించడం దారుణమని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం దిగివచ్చేంత వరకూ తాము ఆందోళన విరమించేది లేదని, ఈనెల 27న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. చోడవరం జేఏసీ ఉద్యోగులు పెన్షనర్లు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులపై ప్రభుత్వం ఆంక్షలు

... 5వ పేజీ తరువాయి

చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఎస్ఈఏ మండల అధ్యక్షుడికి నోటీసు

నాతవరం, ఫిబ్రవరి 17: 'ఛలో విజయవాడ' కార్యక్రమానికి వెళ్లవద్దంటూ నాతవరం పోలీసులు శనివారం మండలంలోని చమ్మచింత ప్రాథమిక పాఠశాలకు వెళ్లి సీపీఎస్ఈఏ మండల అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు అయిన జగన్నాథరావుకు నోటీసు ఇచ్చారు. విజయవాడలో ధర్నాకు హాజరైతే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని నోటీసులో పేర్కొన్నారు. తమ హెచ్చరికను బేఖాతరు చేసి విజయవాడ వెళితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నాతవరం మండలం చమ్మచింత పాఠశాలలో సీపీఎస్ఈఏ మండల అధ్యక్షుడు

బాధిత చిన్నారులకు సాయం

దేవరాపల్లి, ఫిబ్రవరి 17: మండలంలోని వేచలం గ్రామానికి చెందిన ఆడారి దామోదర్, ప్రసన్నలక్ష్మి దంపతులు రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. వీరి సంతానం ఆడారి. యశ్విత (5), జాషిత శ్రీచాతుర్య (6) అనాథలయ్యారు. ఈస్థితిలో ఉప ముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి వీరి దుస్థితిని తీసుకువెళ్లడంతో చిన్నారులిద్దరికీ ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేశారు. ఈ చెక్కులను శనివారం స్వయంగా ఆ గ్రామానికి వెళ్లి అమ్మమ్మ, తాతయ్యలు దొడ్డి.స్వామినాయుడు, పరమేశ్వరిలకు ఆయన అందజేశారు. ఆ చెక్కులను బ్యాంకులో వేసే బాధ్యతను సర్పంచ్ శటారినాయుడుకు అప్పగించారు. జెడ్పీటీసీ సభ్యుడు కర్రిసత్యం, వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, చిన్నంనాయుడు, ఆర్వీకెనాయుడు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

కె.కోటపాడు: మండలంలోని ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. శనివారం మండలంలో నిర్వహించిన పలు గ్రామాల్లో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమాల్లో ఉప ఆయన పాల్గొన్నారు. సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ప్రజా నీటి అవసరాలు నిమిత్తం ప్రతి ఇంటికి కుళాయిలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పిల్లలకు చెక్కులను అందిస్తున్న ఉపముఖ్యమంత్రి ముత్యాలనాయుడు

మాడుగుల
నియోజకవర్గం

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత

▸ ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి



మాట్లాడుతున్న పీడీ అనంతలక్ష్మి

చీడికాడ, ఫిబ్ర వరి 17: బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం వీఆర్వో లు, మహిళ పోలీసులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీ కార్యకర్తల తో ఆడపిల్లల సంరక్షణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆడపిల్లను కనీసం డిగ్రీ పూర్తయ్యేవరకైనా చదివించేలా తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. 18 ఏళ్ల తరువాత బా లికలకు, 21 ఏళ్ల తరువాత పురుషులకు వివాహాలు జరిగేలా చూడాల న్నారు. సమాజంలో మహిళల అభివృద్ధి వెనుక కుటుంబ సహకారం ఉం డాలని ఎంపీపీ కురచా జయమ్మ ఈసందర్భంగా అన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీవో సిహెచ్.శ్రీదేవి, సూపర్‌వైజర్లు జివి.రమణి పాల్గొన్నారు.

'ఎరుకునాయుడు కృషి అమోఘం'

కె.కోటపాడు, ఫిబ్రవరి 17 : గుమస్తాగా ఉద్యోగం జీవితాన్ని ప్రారంభించి కఠోర శ్రమతో విశ్వవిద్యాలయం ఆచార్యునిగా ఉన్నత శిఖరాలకు ఎదిగిన ఎరుకునాయుడు ఆదర్శనీయులని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం విశ్రాంత వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. లా కాలేజీ ప్రొఫెసర్‌గా పనిచేసి ఇటీవల మృతి చెందిన మండలంలోని రొంగలినాయుడుపాలెంనకు చెందిన రొంగలి ఎరుకునాయుడు సంస్మరణ సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎరుకునాయుడు ఏయూలో ప్రొఫెసర్‌గా విశేష సేవలందించారన్నారు.ఈ సభలో విశ్రాంత న్యాయమూర్తులు పి. ముత్యాలనాయుడు, ఎల్. శ్రీరా మమూర్తి, విశ్రాంత రిజిస్ట్రార్ దామోదర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పూడి సత్యనారాయణ, కంపెనీ సెక్రటరీసత్యనారాయణ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం....

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 17: మండలంలోని తాటిపర్తిలో రామాంజనేయ ఆలయ నిర్మాణానికి టీడీపీ మాడుగుల నియోజక వర్గ నాయకులు పైలా ప్రసాదరావు రూ. 10వేలు విరాళం అందించారు. శనివారం చోడవరంలో తన నివాసంలో ఈ విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో అల్లంగి శంకర్రావు, ప్రసాద్, లక్ష్మి, వరలక్ష్మి, మణి ఉన్నారు.